క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. భక్తులు అమ్మవారికి చీర,సారె, పిండివంటలు తదితర వాటిని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నిధుల మంజూరు

ఉయ్యాలవాడ : మండలంలో నాడు–నేడు మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో అత్యవసర మౌలిక వసతుల నిమిత్తం ప్రభుత్వం రూ. 18.46 లక్షలు మంజూరు చేసిందని ఆ పథకం ఏఈ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌కు రూ. 8.30 లక్షలు, రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలకు రూ. 53 వేలు, పుచ్చకాయలపల్లె కస్తూర్బాకు రూ. 3.97 లక్షలు, హరివరం, కాకరవాడ ప్రాథమిక పాఠశాలలకు రూ.28 వేల చొప్పున, అల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలకు రూ. 4.16 లక్షలు, ఇంజేడు ప్రాథమిక పాఠశాలకు రూ. 53 వేలు, పెద్దయమ్మనూరు ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.41 వేలు విడుదలయ్యాయన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ చట్టాలను గౌరవిస్తూ కులమతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా ఏవైనా వదంతులు, రెచ్చగొట్టే విధంగా పోస్టింగ్‌లు పెడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలను రెచ్చగొడుతూ ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపట్ల ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సీఐలు ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణా, నరసింహులు, ఇస్మాయిల్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): అర్హత ఉండి పథకాలు పొందలేని వారు జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని 26వ వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ కోరారు. అర్హులను గుర్తించేందుకు ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తెచ్చిందని, అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే 11 రకాల సేవలను పొందవచ్చన్నారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



మహర్షి వాల్మీకి దేవాలయానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

నంద్యాల(రూరల్): మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ పులి కొండన్న ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీజీ నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జయరాం, జిల్లా అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో నూతన నంద్యాల మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మద్దిలేటి, అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బంగారయ్య, ఉపాధ్యక్షుడిగా సుబ్బయ్య, సహాయ కార్యదర్శిగా కిట్టు, కంబన్న, మెంబర్స్‌గా సన్నయ్య, రాము, వెంకటరమణ, మధు వెంకటేశ్వర్లు తదితరులను ఎన్నుకున్నారు.

మోస్తరు వర్షం

దొర్నిపాడు: మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఇప్పటికే సాగుచేసి మినుము పంటకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆళ్లగడ్డ: పట్టణంలోని స్వాంతన వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన న్యూరో వైద్యశిబిరం విజయవంతమైంది. నంద్యాలకు చెందిన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సునీత రోగులను పరీక్షించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆసుపత్రి నిర్వాహకులు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సుధామణి పాల్గొన్నారు

చెరువు చిన్నబోయింది

- ఆక్రమణదారుల గుప్పిట్లో నంద్యాల చిన్న చెరువు
- ఏక్‌సాల్ పేరుతో గతంలో చెరువు భూముల కేటాయింపు
- నాటి నుంచి నేటి వరకు రెన్యూవల్ చేయించుకోని రైతులు
- వారి చాటున ఆక్రమణదారుల ప్రవేశం
- ఒకే వ్యక్తి చేతిలో 120 –150 ఎకరాలు
- ఆక్రమిత భూములతో 'రియల్' వ్యాపారం
- నామమాత్రంగా అధికారుల చర్యలు

నలభై ఏళ్ల క్రితం నంద్యాల చిన్న చెరువులోని మిట్ట ప్రాంతంలోని భూమిని సాగు చేసుకునేందుకు పేద రైతులకు అధికారులు ఏక్‌సాల్ పేరుతో కేటాయించారు. వారు ఏటేటా రెన్యూవల్ చేయించుకోవాలి. వారి ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకొని ఓ వ్యక్తి వారి నుంచి చెరువు భూములను కొనుగోలు చేశాడు. ఇంతలో కొందరు ఆక్రమణదారులు రైతుల చాటున ఆక్రమణలకు తెరతీశారు. ఇప్పటికే పొలాలు కొనుగోలు చేసిన వ్యక్తి మరింత భూమిని తన అధీనంలో ఉంచుకున్నాడు. ఇలా చెరువు కబ్జా కోరల్లో చిక్కి చిన్నబోయింది. ఫలితంగా చెరువులో నీటి నిల్వ పడిపోయింది. దీంతో సాగు, తాగు నీటికి కష్టాలు ఎదురవుతున్నాయి.



నంద్యాల చిన్నచెరువు



చెరువులోని మిట్ట ప్రాంతం

నంద్యాల(అర్బన్): నంద్యాల పరిసర ప్రాంత ప్రజల అవసరాల కోసం దశాబ్దాల క్రితం నంద్యాల చిన్నచెరువును ఏర్పాటు చేశారు. కొత్తపల్లె, బిల్లలాపురం, కోడూరు తదితర గ్రామాల రైతుల పొలాలకు రెండు పంటలకు నీరు అందిస్తూ వేసవిలో పట్టణ వాసుల గొంతు తడిపే చిన్నచెరువు నేడు ఆక్రమణల బారిన పడి బక్కచిక్కింది. చెరువు మునక ప్రాంతంలో గతంలో ఇచ్చిన ఏక్‌సాల్ పట్టాల సాకుతో ఏళ్ల తరబడి ఆక్రమణదారులు పంటల సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా ఆ భూములను రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉండగా విక్రయించుకున్నారు. రైతుల మాటున కొందరు భూముల ఆక్రమణలకు తెగబడ్డారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, కేసీ కెనాల్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చెరువులో నీరు నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయింది.

460 ఎకరాల్లో..

నంద్యాల నుంచి మహానంది వైపు వెళ్లే రహదారిలో చిన్నచెరువు ఉంది. దాదాపు 460 ఎకరాల్లో ఏర్పాటైన చెరువులో 235 ఎకరాలు మిట్ట భూమిగా ఉంది. రైతులకు సాగునీరు, పట్టణ వాసులకు తాగునీటి అవసరాలు తీరుస్తూ వస్తున్న చెరువులోని మిట్ట భూముల్లో బిల్లలాపురం, కొత్తపల్లె గ్రామాల ఎస్సీ పేద రైతులకు 30 ఏళ్ల కిత్రం అధికారులు ఏక్‌సాల్ పట్టాలు ఇచ్చారు. ఏక్‌సాల్ అంటే ఏడాదిపాటు మాత్రమే పంట సాగు చేసేందుకు అర్హత కల్పిస్తూ జారీ చేసిన పట్టా. ఏడాది తరువాత ప్రభుత్వం నుంచి మళ్లీ రెన్యూవల్ పొందాలి. ఒకవేళ ప్రభుత్వం రెన్యూవల్ చేయకపోతే వారికి సాగు చేసుకునే హక్కు ఉండదు. అయితే ఏక్‌సాల్ పట్టాలు పొందిన రైతులు రెన్యూవల్ చేయించుకోకపోగా.. విక్రయించుకున్నారు. మరికొందరు ఏళ్ల తరబడి అనధికారికంగా సాగు చేస్తున్నారు.

రైతుల మాటున.. కబ్జాదారుల పాగా..

నాడు చెరువులో మిట్ట ప్రాంతంలో 40 మంది ఎస్సీ పేద రైతులకు 30 సెంట్లు, 50 సెంట్ల ప్రకారం ఏక్‌సాల్ పేరుతో అధికారులు పట్టాలు ఇచ్చారు. వారి మాటున కొందరు ఆక్రమణదారులు వందల ఎకరాల్లో పాగా వేశారు. దీంతో ప్రస్తుతం చెరువు కనిపించకుండే వెళ్లేంత వరకు చేరింది. ముఖ్యంగా కొంత మంది వ్యక్తులు పేదల నుంచి 30 సెంట్లు, 50 సెంట్ల భూములను కొనుగోలు చేసి వందల ఎకరాలు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. రిజిస్టర్ పట్టాలు ఉన్నాయంటూ చెరువు భూములను ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. షెడ్లను ఏర్పాటు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు.

బడా ఆసాముల చొరబాటు..

ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నంద్యాలలో స్థిరపడి పేదల నుంచి భూములను కొనుగోలు చేసి చెరువులో పాగా వేశాడు. ఈయన గుప్పిట్లో దాదాపు 120 నుంచి 150 ఎకరాల పొలం ఉంది. ఇందులో అధిక శాతం బిల్లాలపురం గ్రామానికి చెందిన రైతులకు కౌలుకు ఇచ్చాడు. మిగిలిన కొంత పొలాన్ని మాత్రం తన ఆధీనంలో ఉంచుకొని పంటలు సాగు చేస్తున్నాడు. పేదల నుంచి ఏక్‌సాల్ పట్టా భూములను కొనుగోలు చేసి ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే భూములకు రిజిస్టర్ పట్టాలు ఉన్నాయని అధికారులతో వాదనకు దిగుతున్నారు. సర్వేకు వచ్చిన అధికారులను మచ్చిక చేసుకోవడం పరిపాటిగా మారింది. ఓ మాజీ ప్రజాప్రతినిధికి సైతం ఆక్రమణల్లో భాగస్వామ్యం ఉందని సమాచారం. ఆ భూములు పేదలకు తిరిగి పంచాలంటూ ప్రజాసంఘాలు ఆందోళనలు నిర్వహించినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఆ భూములు పేదలకు పంచాల్సిందే



చెరువు భూముల్లో ఉపాధి కోసం ప్రభుత్వం పేదలకు ఏక్‌సాల్ పట్టాలు మంజూరు చేసింది. పేదల ఆర్థిక పరిస్థితులను ఆసరా చేసుకొని భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసుకొని స్వాధీనం చేసుకోవడం దుర్మార్గం. ఏక్‌సాల్ పట్టా భూములకు రిజిస్టర్ పట్టాలు ఉన్నాయనడం అన్యాయం. ఆక్రమణ భూములను తిరిగి పేదలకు ఇవ్వాలంటూ పలుమార్లు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు న్యాయం జరిగేలా చూడాలి. – నరసింహ, రైతు సంఘం నాయకుడు, నంద్యాల

ఆక్రమణలను ఆపాలి



చిన్నచెరువులో ఒక్కొక్కరికి 30సెంట్ల ప్రకారం 40 మందికి మాత్రమే ఏక్‌సాల్ పట్టాలు ఇచ్చారు. క్రమేణా మిట్ట భూములను బడా బాబులు ఆక్రమించుకోవడంతో చెరువు కుచించుకు పోయింది. 460 ఎకరాలు ఉన్న చెరువు ప్రస్తుతం 235 ఎకరాలకు పరిమితమైంది. ఆక్రమణలు రోజురోజుకు పెరిగి పోతుండటంతో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నచెరువు ఆక్రమణలపై ఆయకట్టు రైతులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. జిల్లా అధికారులు స్పందించి చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడాలి. – శ్రీహరి, ఆయకట్టు రైతు, నంద్యాల

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



భవానీ నగర్‌లో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతోనే విద్యా వ్యవస్థ ప్రక్షాళన జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 3వ సచివాలయ పరిధిలోని 11వ వార్డులో శ్రీనివాసనగర్ నుంచి న్యూబిల్డింగ్స్ కాలనీ, భవానీ నగర్, పోస్టాఫీసు, ఎస్‌బీఐ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు స్థానిక నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు పథకాల గురించి వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి పథకాలు అందని వారికి 1వ తేదీ నుంచి జగనన్న సురక్షలో న్యాయం జరుగుతుందని చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, కార్పొరేట్ స్థాయికి తగ్గకుండా వసతులు కల్పించడమే కాకుండా వివిధ పథకాలు అందజేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు షేక్ బాబులాల్, కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఈఓఆర్డీ సుదర్శన రావు, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, రఫీ, మండల కో–అప్షన్ సభ్యుడు జె.ఇబ్రహిం, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపీటీసీ ఫయాజ్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

గడప గడప పనులకు ఆమోదం

శిరివెళ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని 4 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. 1వ గ్రామ సచివాలయ పరిధిలో మంగళి వెంకటసుబ్బయ్య ఇంటి నుంచి తిమ్మరాయుడు ఇంటి వరకు సిమెంట్ రోడ్డు, మురుగు కాల్వ నిర్మాణం చేపడుతున్నామన్నారు. బలిజపేటలోని సుబ్బలక్ష్మమ్మ ఇంటి నుంచి బావికాడి సుబ్బరాయుడు ఇంటి వరకు, ముబారక్ పేటలోని డ్రైవర్ ఇంతియాజ్ నుంచి తంబా జమాల్ బాషా ఇంటి వరకు సీసీ రోడ్డు, మురుగు కాల్వ. రెండవ సచివాలయం పరిధిలోని సిండికేట్ బ్యాంక్ వెనుక వీధిలో, జీ. మహమ్మద్‌బాషా ఇంటి నుంచి బసాపురం మగ్బుల్ బాషా ఇంటి వరకు, నారాయణ ఇంటి నుంచి పాపన్నింటి వరకు రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణాలు జరుగుతాయన్నారు. అలాగే 3వ గ్రామ సచివాలయ పరిధిలో దొర్నిపాటి బాషా ఇంటి నుంచి వంటెద్దు మహమ్మద్ ఇంటి వరకు, ఆయూబ్‌ఖాన్ ఖాళీ స్థలం నుంచి దొర్నిపాటి ఇస్మాయిల్ బజార్ వరకు, మాబు సుభాని దర్గా నుంచి టీచర్ సలాం ఇంటి వరకు రోడ్డు వేస్తామని, మొత్తం రూ.60 లక్షలతో పనులు త్వరలో మొదలవుతాయని చెప్పారు.

ప్రజల ఆకాంక్ష..జగనన్న సురక్ష

- ఉచితంగా 11 రకాల సచివాలయ సేవలు
- ప్రజలకు మేలు దిశగా జగనన్న సురక్ష పథకం

దొర్నిపాడు: అర్హులై ఉండి ఏ ఒక్కరూ పథకాలకు దూరంగా ఉండిపోరాదని ప్రభుతం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం జగనన్న సురక్ష. గ్రామ వార్డు సచివాలయల్లో నెలరోజుల పాటు కార్యక్రమం నిర్వహించనున్నారు.

సమస్య పరిష్కారమయ్యే వరకు తోడుగా..

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రతి ఇంటిని సందర్శిస్తారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి పొందని వారుంటే గుర్తించి సమస్య పరిష్కారానికి కావాల్సిన పత్రాలను సేకరిస్తారు. ఇలా తీసుకున్న దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పించి టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకొని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారు. ఇలా సమస్య పరిష్కారమయ్యే వరకు వారికి తోడుగా ఉంటారు.

సిద్ధంగా డాక్యుమెంట్లు

11 రకాల సర్వీసులు, వాటికి కావలసిన డాక్యుమెంట్లను ఆయా సచివాలయాల్లో సిద్ధంగా ఉంచారు. కుల, ఆదాయ, జనన, మరణ, పట్టాదారు పాసుపుస్తకం, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్, కౌలుకార్డు, కొత్త రైస్ కార్డు స్ప్లిట్, హౌస్‌హోల్డ్ స్ప్లిట్ వంటి సేవలను ఉచితంగా ఇస్తారు.

సేవలు.. వాటి వివరాలు

ధ్రువపత్రాలు	చెల్లించాల్సి చార్జీలు రూ.	జగనన్న సురక్ష పథకంలో
కులం	రూ.50	ఉచితం
ఆదాయం	రూ.50	ఉచితం
జనన ధ్రువ పత్రం	రూ.150	ఉచితం
మరణ ధ్రువీకరణ పత్రం	ఉచితం	ఉచితం
పట్టాదారు పాసుపుస్తకం	రూ.150	ఉచితం
వివాహ ధ్రువ పత్రం	రూ.150	ఉచితం
ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ	రూ.50	ఉచితం
పొలంపాస్ పుస్తకం ఫోన్ నంబర్ లింక్‌కు	రూ.50	ఉచితం
కౌలుకార్డు కొరకు	ఉచితం	ఉచితం
రైస్ కార్డు స్ప్లిట్	రూ.50	ఉచితం
హౌస్‌హోల్ మ్యాప్‌లో స్ప్లిట్	ఉచితం	ఉచితం

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ: మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

రైతులకు నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా

నంద్యాల(రూరల్): రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల మండల విద్యుత్ అధికారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని అయ్యలూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో గ్రామ రైతులతో అడ్వైజర్ కమిటీ కార్యక్రమం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ గ్రామ రైతులు ప్రభుత్వం సరఫరా చేస్తున్న విద్యుత్ వేళలు మార్చాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారన్నారు. రైతుల కోరిక మేరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను ఉదయం 8 గంటలకు కాకుండా ఉదయం 5 గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు. నంద్యాల మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ బసవేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలనే ఉద్దేశంతో, సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బంది ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలు అందిస్తామని, సురక్షణపై అవగాహన కల్పించాలని చెప్పారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయండి

గోస్పాడు: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని డీఈ వర్మ సూచించారు. మండలంలోని గోస్పాడులో నిర్మిస్తున్న ఇళ్లను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను పూర్తి చేసుకొనేలాసిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బొమ్మలసత్రం: రౌడీషీట్లు ఉన్న వారు మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు సబ్‌డివిజన్ల పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం ఆయా సబ్‌డివిజన్ల ఎస్‌డీపీఓ, ఎస్ఐల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

ఆళ్లగడ్డ: స్థానిక ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా తైక్వాండో పోటీలను డాక్టర్ రాంగోపాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. సుమారు 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర తైక్వాండో కార్యదర్శి చంద్రమౌళి ట్లాడుతూ 30 ఏళ్ల నుంచి తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అ'పూర్వ' కలయిక



నాటి గురువును సన్మానిస్తున్న మిత్రులు

ఆళ్లగడ్డ: స్థానిక వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్న వీరు నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సత్కరించారు. 40 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్జిగా పనిచేస్తున్న శ్రీనివాసులతో పాటు ఎందరో డాక్టర్లు, వ్యాపారవేత్తలుగా స్థిరపడిపోయారు.

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1996–97 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చదివిన పాఠశాలకు తమవంతుగా రూ.40 వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను, పాఠశాల ప్రధాన గేటు మరమ్మతు కోసం రూ.5 వేల గదును అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఇబ్రహీం, రిటైర్డ్ ఎంఈఓ మహమ్మద్ బాషా, పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు రమణ గౌడు, ప్రసాద్, అబ్దుల్ రబ్, ముదలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

28లోపు దరఖాస్తు చేసుకోండి

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో 7,8,9,తరగతుల్లో విద్యనభ్యసించేందుకు ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆయా తరగతుల్లో కొన్ని ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లభించాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఆధార్, స్టడీ సర్టిఫికెట్లతో పాఠశాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి కాగానే ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్,రోల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తామని విరించారు.

గోస్పాడు: స్థానిక మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 30 లోపు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 7వ తరగతిలో 4, 8లో 6, 9వ తరగతిలో 3 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 చెల్లించాలన్నారు. విద్యార్థులకు జూలై 5న ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 855 5056342 నంబరులో సంప్రదించాలని కోరారు.

మాటపై నిలి-చారి'లా'

- నేడు ఐదో విడత 'లా నేస్తం' విడుదల
- జూనియర్ న్యాయవాదులకు రూ.5వేల స్టయిఫండ్
- వారి సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- జిల్లాలో 127 మంది న్యాయవాదులకు జమ కానున్న నగదు

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాదుల సమస్యలు పరిష్కరించి వారికి అండగా ఉంటామనే మాట మేరకు సీఎం అయిన్పటి నుంచి లా నేస్తం పేరుతో న్యాయవాదులకూ అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీరుపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు జూనియర్ న్యాయవాదులకు రూ.5వేలు స్టయిఫండ్ దేశంలో ఎక్కడాలేని విధంగా అందజేస్తున్నారు. లా చదివి సరైన ప్రోత్సాహం లేక ఇబ్బంది పడుతున్న జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.5వేలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఐదవ విడత సొమ్ము జూనియర్ న్యాయవాదులకు జిల్లాలో 127 మందికి నగదు నేరుగా బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నాల్గో విడతలో 127 మంది యువ న్యాయవాదుల ఖాతాల్లో రూ.3.81 కోట్లు నగదు జమ చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించిన ఘనత సీఎంకే దక్కుతుంది. న్యాయవాదులకు బీమా సౌకర్యం, చనిపోయిన న్యాయవాదులకు బార్ కౌన్సిల్ వారు రూ.4లక్షలు ఇస్తుంటే మ్యాచింగ్ గ్రాంట్ కింద మరో రూ.4లక్షలు ప్రభుత్వం అందజేస్తుంది. కరోనా కష్ట కాలంలో న్యాయవాదులను ఆదుకునేందుకు జూనియర్ న్యాయవాదులకు రూ.10వేలు, సీనియర్ న్యాయవాదులకు రూ.20వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

న్యాయవాద వృత్తికి గుర్తింపు



మేం న్యాయవాద వృత్తిలో నిలదొక్కుకునేందుకు స్టయిఫండ్ ఉపయోగపడుతుంది. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణం స్టయిఫండ్ ఇచ్చారు. ఇప్పటి వరకు రూ.60వేలు లబ్ధి పొందినందుకు సంతోషంగా ఉంది. –అంబేడ్కర్, జూనియర్ న్యాయవాది, నంద్యాల

ఆనందదాయకం



ఏడాది పాటు లా నేస్తం పథకం పొందుతున్నాను. సీనియర్ న్యాయవాది వద్ద జూనియర్లుగా పని చేస్తున్నా అనేక మందికి ఆదాయం ఉండదు. కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా వారు ఖర్చులకు సైతం ఇబ్బంది లేకుండా ఉంది. –హారిక, జూనియర్ న్యాయవాది నంద్యాల

న్యాయవాదులకు న్యాయం చేసిన సీఎం



ఏ సీఎం చేయనటువంటి విధంగా న్యాయవాదులకు లబ్ధి చేకూర్చిన ఘనత జగనన్నకు దక్కింది. గతంలో ప్రభుత్వాలు ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించారు. జూనియర్ న్యాయవాదులకు, న్యాయవాద సంక్షేమానికి రూ.100 కోట్లు, మృతి చెందిన వారికి బీమా సౌకర్యంతో పాటు మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.4లక్షలు అందజేయడం అభినందనీయం. – విజయశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, నంద్యాల

యూటర్న్...పార్కింగ్‌లా మారెన్

నంద్యాల (సెంట్రల్): రద్దీకి చిరునామాగా మారిన గాంధీచౌక్ ఇష్టానుసారంగా పార్కింగ్‌తో ట్రాఫిక్‌జామ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. దుకాణాల ముందు, దారులకు అడ్డంగా ద్విచక్ర వాహనాల్ని నిలిపి ఉంచుతుండటంతో వాహనాలు ఎదురు పడినప్పుడు దాటుకుని వెళ్లటానికి ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా ప్రధాన రహదారి నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారి వద్ద ఉన్న యూటర్న్ ఏకంగా పార్కింగ్ స్థలంగా మారింది. రోడ్డుపై ఇరువైపులా దుకాణాల ముందు, యూటర్న్‌లో నిలిపి ఉంచిన వాహనాలతో చోదకులు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు.



గాంధీచౌక్‌లో యూటర్న్‌పై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

పాస్టర్‌కు సన్మానం

ఆళ్లగడ్డ: స్థానిక ఎస్పీజీ చర్చి పాస్టర్ ఏసు రత్నంను సభ్యులు ఆదివార సన్మానించారు. ఆళ్లగడ్డ ఎస్పీజీ సంఘంలో డీనరీ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఏసురత్నం కర్నూలుకు బదిలీ అయ్యాడు. ఈ సందర్భంగా ఆదివారం చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పాస్టర్ దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

మహిళల స్థితిగతులలో మార్పు కోసం పోరాటం

నంద్యాల(న్యూటౌన్): మహిళల స్థితిగతుల మార్పు కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో 15వ రాష్ట్ర మహాసభల జయప్రదానికి ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ, కార్యదర్శి లక్ష్మిదేవి, సీపీఐ సహాయ కార్యదర్శిబాబాఫకృద్దీన్, ప్రసాద్ పాల్గొన్నారు.